## క్లుప్తంగా

### గృహ సారథులు, కన్వీనర్లతో రేపు సమావేశం

అడ్డతీగల: మండలంలోని తుంగమడుగులలో శనివారం ఉదయం 10 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తుంగమడుగుల, వీరవరం, రాయపల్లి, డి.రామవరం, ధాన్యంపాలెం, వేటమామిడి, డి.భీమవరం, దుశ్చర్తి సచివాలయాల పరిధిలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

### తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


గ్రామంలో తాగునీటి సదుపాయం వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

దుంబ్రిగుడ: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ ఆధ్వర్యంలో గురువారం నాయకులు సింహాచలం గ్రామాల్లో సందర్శించారు. జెడ్పీటీసీ నిధులతో కొత్రగొంది, రంగినివలస, దేముడువలస గ్రామాల్లో, ఎంపీపీ నిధులతో కమలబంధ, సాగేరివలస ప్రాంతాల్లో ఒక్కో గ్రామానికి రూ.2లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. నాయకులు నర్సింగరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### పశు వ్యాధులపై అప్రమత్తం


కురిడిలో గొర్రెకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీలో గల్లుంగు, బలియగుడ, కురిడి, గోరాపూర్, పుట్టనింద, నిమ్మగెడ్డ తదితర గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 1624 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది త్రినాథరావు, రమేష్, సంజీవ్, అప్పారావు, ప్రకాష్, మహేష్, మనోజ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### 200 మందికి వైద్య పరీక్షలు


మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు

మారేడుమిల్లి: మండల కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన కేశవ ఎమర్జెన్సీ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 200 మందికి డాక్టర్లు కేతన్, మౌలిక వైద్య పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ పి.హరికృష్ణ, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, మండల పార్టీ కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ ధర్నా

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం స్థానిక సభ్యులు ధర్నా నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ త్రినాథ్‌నాయుడుకు వినతి పత్రం అందజేశారు. శ్యామ్‌సుందర్, పోతురాజు, మాలంనాయుడు, సోంబాబు, శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులకు మహర్దశ

- 'అమృత్ సరోవర్'తో బాగుపడుతున్న జలాశయాలు
- పుష్కలంగా సాగునీరు
- ఆరు చెరువుల్లో పనులు పూర్తి


చెరువు పనుల వివరాలున్న బోర్డు


అమృత సరోవర్ ప్రాజెక్టు ద్వారా దొడ్డవరం నేరేడుమాను చెరువులో కందకాల తవ్వకాలు

కొయ్యూరు: మండలంలోని రైతులు సాగునీటి కోసం చెరువులు.. జలాశయాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. వాటి ద్వారానే పంటలు పండిస్తున్నారు.. పాడైన చెరవులను బాగు చేసేందుకు ఇది వరకు నిధులు ఎక్కువగా ఉండేవి కావు. తాజాగా కేంద్రం ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చెరువులను బాగు చేసేందుకు వీలుగా చేపట్టిన అమృత్ సరోవర్ ప్రాజెక్టుతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ కారణంగా చెరువుపై ఆధారపడిన భూములకు నీరు పుష్కలంగా రానుంది. మండలంలో ఇప్పటి వరకు ఆరు చెరువులను బాగు చేశారు. ఇందులో భాగంగా చిన్న చిన్న ఆనకట్టల్లో పాడైన గేట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఫలితంగా శివారు ప్రాంతాలకు పుష్కలంగా సాగునీరు అందుతోంది.

**నేరేడుమాను చెరువులో పూడికతీత**

మర్రివాడ పంచాయతీలో దొడ్డవరానికి చెందిన నేరేడుమాను చెరువు పూడికతో నిండి ఉండేది. వర్షాకాలంలో ఎక్కువ నీరు నిల్వ ఉండేందుకు ఆస్కారం ఉండేది కాదు. ఈ కారణంగా దానిపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడేవారు. దానిని అమృత సరోవర్ ప్రాజెక్టులో ఎంపిక చేశారు. ఇందులో భాగా రూ.26 లక్షలతో పనులు చేపట్టారు. చాలా వరకు పూడికను తీశారు. చెరువును ఆనుకుని కందకాలను తవ్వారు. దీంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇక పాడైన గేట్లను కూడా బాగు చేయనున్నారు. చెరువు విస్తీర్ణాన్ని అనుసరించి ఒక్కో దానికి రూ.9లక్షల నుంచి రూ.35 లక్షల వరకు కేటాయిస్తున్నారు. ఉపాధి నిధుల ద్వారా పనులు చేయిస్తున్నారు. దీని మూలంగా ఒక వైపు కూలీలకు పనులు దొరకుతున్నాయి. మరోవైపు రైతులకు మేలు జరగనుంది. ఇలా మండలంలో ఇప్పటి వరకు మంప పంచాయతీలో రెండు చెరువులను, ఆర్.కొత్తూరు, శరభన్నపాలెం, మర్రివాడలో ఒక్కో చెరువును బాగుచేశారు. కొన్ని చెరువుల్లో ఎప్పుడో ఏర్పాటు చేసిన గేట్లు పాడయ్యాయి. వాటిని తొలగించి కొత్తవి వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గేట్లు పాడవ్వడం మూలంగా చెరువులు లేదా జలాశయాల్లో నీరు వృథాగా పోతుంది. ఈ యేడాది ఎక్కువ చెరువులను అమృత్ సరోవర్ పథకంలో చేర్చేందుకు అధికారులు చూస్తున్నారు.

**పంచాయతీలో ఒక్కో చెరువు ఎంపిక**

అమృత సరోవర్‌లో భాగంగా ఇప్పటి వరకు ఆరు చెరువులను ఎంపిక చేశాం. వాటిలో చాలా వరకు పనులను పూర్తి చేశాం. త్వరలో పంచాయతీలో ఒక్కో చెరువును ఎంపిక చేసి పనులు చేపట్టాలని చూస్తున్నాం. దీనిపై వీఆర్‌పీలతో సమావేశం ఏర్పాటు చేసి కీలకమైన చెరువుల వివరాలను తీసుకుని అనుమతి కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. చెరువులు బాగయితే నీరును ఎక్కువగా నిల్వ ఉంచేందుకు అవకాశం ఉంటుంది. – రాజు, ఏపీవో, కొయ్యూరు

## దగ్ధమైన బస్సు ఎట్టకేలకు తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


దగ్ధమైన బస్సును తరలిస్తున్న రికవరీ వ్యాన్

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డు తైడ సమీపంలోని మలుపువద్ద గత రెండు నెలల క్రితం దగ్ధమైన ప్రైవేటు బస్సును ఎట్టకేలకు తరలించడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు. 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. రెండు నెలల క్రితం విజయనగరం జిల్లా గొల్లాలపేటకు చెందిన కొంతమంది పర్యాటకులు రణదీప్ ట్రావెల్స్ బస్సులో అరకు అందాలకు తిలకించేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు తైడ సమీపంలోని ప్రమాదవశాత్తూ బస్సు దగ్ధమైంది. ఘటన జరిగి రెండు మాసాలు గడుస్తున్నా సంఘటన స్థలం నుంచి బస్సు తొలగించకపోవడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై 'సాక్షి'లో ఈనెల 11న 'సారూ.. పట్టించుకోరూ' శీర్షికతో వార్త ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు దగ్ధమైన బస్సును రికవరీ వ్యాన్‌తో గురువారం బస్సు యజమాని తరలించారు. దీంతో ఘాట్‌రోడ్డులో రాకపోకలకు మార్గం మరింత సుగమమైంది.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ


అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు


దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్ఐ సత్యనారాయణ

కొయ్యూరు: పోలీసు శాఖ తరపున అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సీఐ స్వామినాయుడు హామీ ఇచ్చారు. మండలంలోని అంతాడ పంచాయతీ తాటిమానిపాలెంలో అగ్ని ప్రమాద బాధితులను ఆయన గురువారం పరామర్శించారు. గ్రామంలో గ్యాస్ లీకేజీ కారణంగా నాలుగు పూరిల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలతో సీఐ స్వామినాయుడు మాట్లాడి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. పోలీసు శాఖ తరపున బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి అవసరమైన సాయమందిస్తామన్నారు. సంఘటనలో దగ్ధమైన గృహాలను పరిశీలించారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్యాస్‌పై వంట చేసే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదంలో సుమారు రూ.8లక్షల ఆస్తి నష్టమైనట్టు బాధితులు వాపోతున్నారు.

**ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు**

గ్యాస్ లీకేజీతో నాలుగు పూరిల్లు దగ్ధమైన సంఘటనలో ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25వేలు పరిహారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించినట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ రమేష్ తెలిపారు. దీంతో పాటు నిత్యావసర సరకులను, కాలిపోయిన రికార్డులను తిరిగి పునరుద్ధరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియజేశారన్నారు.

**బాధితులకు ఆర్ఐ అపన్నహస్తం**

కొయ్యూరు: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) దుమంతి సత్యనారాయణ తాటిమానిపాలెంలో అగ్ని బాధితులకు అండగా నిలిచారు. ఆయన గురువారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలకు 150 జతల దుస్తులను అందజేశారు. వాటితో పాటు బకెట్లు, నిత్యావసరాలను కూడా పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని ఆయన చెప్పారు. సర్పంచ్ సుర్ల చంద్రరావు, బాలేసు, రామకృష్ణ, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు కృషి


మంజగూడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మండల కన్వీనర్ పటాసి సంపత్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మాడగడ పంచాయతీ మంజగూడ గ్రామంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గురువారం ప్రచారం చేపట్టామన్నారు. ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన కల్పించామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్ గెలుపే లక్ష్యంగా గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు పార్టీ ముఖ్య నాయకులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా పర్యటించి ఓటర్లను అభ్యర్థించాలన్నారు. ఇప్పటికే మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశామన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు కిరణ్, నర్సింగ్, బాలరాజు, నగేష్ పాల్గొన్నారు.

### ఆదివాసీలకు న్యాయం చేయాలి

పాడేరు రూరల్ : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రామారావు దొర తదితరులు విశాఖలోని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలతోనే ఐదో షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగాలను భర్తీ చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శాంతి కుమారి, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కృష్ణారావు, ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు సింహాచలం, శ్రీనివాస్ పడాల్ తదితరులున్నారు.

## ఆదివాసీ చట్టాలపై అవగాహన అవసరం


కింటూరు గ్రామంలో ఆదివాసీలతో సీతారామన్నదొర

రంపచోడవరం: మండలంలోని ఆకూరు పంచాయతీ కింటుకూరు గ్రామంలో జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి కన్వీనర్ కారం సీతారామన్న దొర (డిల్లీబాబు) గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కోయ తెగల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆదివాసీ యువత సామాజిక, రాజకీయ, విద్య, వైద్య అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమన్నారు. శివారు లోతట్టు ప్రాంతమైన కింటుకూరు గ్రామానికి రోడ్డు రవాణా, తాగునీరు సదుపాయం కల్పించాలని కోరారు. గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం వల్ల చిన్నారులు చదువుకు దూరంగా ఉంటున్నారని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. రోడ్డు నిర్మాణానికి అటవీ అభ్యంతరాలు తొలగించాలన్నారు. ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షుడు

గంగాధర్ రావు, చిన్నబ్బాయి, ఉప సర్పంచ్ కన్నమ్మ, గ్రామపెద్దలు దొర, గంగన్న దొర, సంకురు దొర తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


కళాజాత నిర్వహిస్తున్న బృందం

చింతూరు: కేంద్ర ప్రభుత్వం, నాబార్డు ఆదేశాల మేరకు ఏపీజీవీబి బ్యాంక్ చింతూరు శాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మ్యాజిక్ షో, జానపద పాటలతో కేంద్ర ప్రభుత్వం అందించే సామాజిక భద్రత పథకాలైన పీఎంజెజెబివై, పీఎంఎస్‌బీవై , ఏపీవై, డిజిటల్ లావాదేవీలు, జాగ్రత్తలు గురించి వివరించారు. బ్యాంక్ మేనేజర్ బి వినోద్‌కుమార్, వెలుగు ఏపీవో సోమినాయుడు, బ్యాంక్‌మిత్రలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు అభినందనలు


మహేష్‌బాబును సన్మానిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి,అరకుఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు


జిల్లా కల్చరల్, వాణిజ్య విభాగ అధ్యక్షులు దిలీప్‌కుమార్, శామ్యూల్‌ను సన్మానిస్తున్న నేతలు


ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిరణ్‌కుమార్

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల నియామకంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆయా సంఘాల అధ్యక్షులకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా గొడ్డేటి మహేష్‌బాబు నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత గొడ్డేటి దేముడు కుమారుడు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సోదరుడైన మహేష్ బాబు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేస్తున్నారు. మహేష్‌కు కీలక పదవి రావడంపై సంతోషం వ్యక్తం చేసిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలు గురువారం విశాఖలో మహేష్‌బాబుకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రజల సేవే లక్ష్యంగా దివంగత గొడ్డేటి దేముడు వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాజకీయంగా ఎదగాలన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. నాయకులు శెట్టి అప్పాలు, సత్యనారాయణ, లోవరాజు పాల్గొన్నారు.

**కిరణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే పాల్గుణ అభినందనలు**

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షులుగా ఎల్.బి.కిరణ్‌కుమార్ ఎంపికపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానని, పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

హుకుంపేట: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ అనుబంధ సంస్థల అధ్యక్షులుగా నియమితులైన నాయకులను పార్టీ శ్రేణులు సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు జి.దిలీప్‌కుమార్, వాణిజ్య విభాగ అధ్యక్షుడు ఒంటుబు శ్యాముల్‌ను స్థానిక నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత పదవులు కల్పించడం హర్షణీయమన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వర రావు, సొసైటీ బ్యాంకు చైర్మన్ కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు బేసు, చిన్నారావు, వెంకట్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నాగరాజు, కామరాజు,నాయకులు భూషణ్, సుబ్బు, చిన్నయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగులో రైతులకు సూచనలు


రైతులకు సూచనలిస్తున్న ఏవో రమేష్‌నాయుడు

రాజవొమ్మంగి: ప్రస్తుతం జరుగుతున్న రబీ వరి నాట్లలో మధ్య మధ్యలో కాలిబాటలు వదిలి పెట్టాలని రాజవొమ్మంగి వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు గురువారం రైతులకు సలహా ఇచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రబీ వరినాట్ల విధానాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిస్తు కాలిబాటలు వదిలి పెట్టడం వల్ల చేనుకు గాలి, వెలుతురు బాగా సోకి దోమపోటు వంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోడం వల్ల పొలంలో రసాయన ఎరువులు, మందులు వెదజల్లుకోవడం సులువు అవుతుందన్నారు. ఈ కాలిబాటలను తూర్పు–పడమరలకు ఉండేలా ఏర్పాటు చేసుకొంటే మొక్కలకు సూర్యరశ్మి బాగా సోకుతుందన్నారు. వరి మొక్కలు దూరం దూరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యకరమైన దుబ్బులు వేసి వరి కంకుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ సూచనలు పాటించడం వల్ల దిగుబడిలో గణనీయమైన పెరుగుదల చూడవచ్చని ఆయన రైతులకు వివరించారు. మండలంలో సుమారు వంద హెక్టార్లలో రబీ వరి సాగవుతుందన్నారు. వేసవి వరి సేద్యంలో జింక్ లోపం లేకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. ఊడ్పుకు రెండు లేదా మూడు రోజుల ముందు దమ్ములో జిప్సం వెదజల్లు కోవడం వల్ల పొలంలో కారి అంతమొందించవచ్చన్నారు. జిప్సం వేసిన తరువాత రెండు రోజుల తరువాత మళ్ళలో నీరు పూర్తిగా తీసేసి కొత్తనీరు పెట్టుకోవాలని సూచించారు.

## కూరగాయల సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం
- అందుబాటులో మార్కెటింగ్
- ఆనందంలో రైతులు

కోటవురట్ల: కూరగాయల సాగు రైతుకు ఆర్థిక భరోసా ఇస్తుంది. ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పద్ధతులను అవలంబిస్తూ వివిధ పంటలను సాగు చేస్తే చక్కటి ఫలితం పొందొచ్చు. కూరగాయలు ప్రతి కుటుంబానికి కావలసిన నిత్యావసరం. వీటిని తాజాగా అందిస్తే చెల్లుబాటుకు ఎలాంటి ఢోకా ఉండదు. కొందరు రైతులు అదే పని చేస్తున్నారు. కూరగాయల సాగు చేపట్టి మంచి ఫలితాలు రాబట్టి లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలోని జల్లూరు, యండపల్లి, లింగాపురం, బీకే పల్లి, అన్నవరం, చినబొడ్డేపల్లి, రామన్నపాలెం, పాములవాక, పీకే పల్లి, ఆక్సాహేబుపేట తదితర గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువగా జరుగుతోంది. ప్రధానంగా జల్లూరు, లింగాపురం గ్రామాల్లో పలువురు రైతులు ఏడాది పొడవునా కూరగాయలే సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలోనే అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. వంగ, బెండ, బీర, దొండ, చిక్కుడు, టమాటో, పచ్చిమిర్చి, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు.

**సాగు ఇలా..**

విత్తు నాటిన మూడు నెలల కాల పరిధిలోనే ఫలసాయం వస్తుంది. విత్తు నాటాక సకాలంలో నీటి తడులు పెట్టడం ద్వారా తొందరగా మొక్క ఎదుగుదల సాధ్యపడుతుంది. తెగుళ్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పంటను పరిశీలిస్తూ ఎక్కడైనా తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. ఎకరా పరిధిలో సాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి సుమారు రూ.10 వేల వరకు ఖర్చు కాగా ఫలసాయంతో సుమారు రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది.

**దళారుల బెడద లేకుండా..**

గతంలో రైతులు దళారుల కారణంగా ఎక్కువగా నష్టపోయేవారు. ఇపుడు రైతు బజార్లు రైతుల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుండగా ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. కాలంతో పాటు పరుగెడుతున్న రైతులు ఇప్పుడు నేరుగా వారే విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు వారపు సంతలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అంతే కాకుండా ప్రధాన రహదారుల వెంబడి తాజాగా కోసుకొచ్చిన కూరగాయలను వాటాలుగా పెట్టి విక్రయిస్తున్నారు. తాజా కూరగాయలు దొరుకుతుండడంతో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. దీని వల్ల రైతుకు సరకు విక్రయానికి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం లేదు. ఆశీలు బెడద లేదు. దళారుల గొడవ అసలే లేదు. నేరుగా లాభాలన్నీ రైతుకే దక్కుతున్నాయి.



### ఘనంగా కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని కల్యాణం

మునగపాక: మెయిన్‌రోడ్డులోని లింగరాయిగుడిలో గురువారం కాశీ విశాలాక్ష్మి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు సోమశేఖర్ నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, కిరణ్, భీశెట్టి వెంకట్, ఆడారి అచ్చియ్యనాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: గొరపూడిలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రావికమతం: తట్టబందలో షిర్డీసాయి మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గోకివాడ రమణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.